

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న సాధారణ ఎన్నికల్లో శాంతి, భద్రతల సమస్యలు రాకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలను ఇప్పటి నుండే సిద్ధం చేసుకోవాలని ఎస్‌పి మేరీ ప్రశాంతికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్‌ను ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఎస్‌పి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు, నూజివీడు డిఎస్‌పిలు శ్రీనివాసరావు, గౌడ్, సిఐలు, పోలీసు సిబ్బంది కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ అభ్యర్థులు కావలెను..!

పోటీచేసేందుకు అభ్యర్థులు కరువు

రెండు ఎంపీ స్థానాల్లోనూ టిడిపి, వైసిపికి అదే పరిస్థితి

ఎటువంటి అధికారాలూ ఉండటం లేదని పోటీకి విముఖత

ఎంఎల్‌ఎగా పోటీ చేసేందుకే అంతా మొగ్గు

బలవంతంగా ఒప్పించే ప్రయత్నంలో అధిష్టానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపికి పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై స్పష్టత లేకుండాపోయింది. కనీసం ఆశావహుల పేర్లు కూడా విన్పించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఎంపీ స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరూ ముందుకు రాకపోవడమేనని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో ఆర్థికంగా బలంగా ఉన్న కొత్తవారి కోసం పార్టీలు వెదుకులాడుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలో రెండు పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలు ఏలూరు, నరసాపురం ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను వైసిపి గెలుచుకుంది. నరసాపురం నుంచి కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు నుంచి కోటగిరి శ్రీధర్ గెలిచారు. గెలిచిన కొద్దికాలానికే నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు, వైసిపికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఎంపీ రఘురామకృష్ణంరాజు అప్పటి నుంచి జిల్లాకు దూరంగా ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయబోనని కోటగిరి శ్రీధర్ తేల్చేసినట్లు చెబుతున్నారు. ఎంఎల్‌ఎగా అవకాశం ఇస్తే పోటీ చేస్తానని శ్రీధర్ అన్నట్లు తెలుస్తోంది. నరసాపురం స్థానంలోనూ కొత్త అభ్యర్థిని వైసిపి నిలబెట్టాల్సి ఉంది. ఎంపీగా పోటీ చేయాలంటే కనీసంగా రూ.50 నుంచి రూ.75 కోట్లు వరకూ ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దాదాపు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇంత ఖర్చు పెట్టి గెలిచినా తమకు ఎటువంటి గుర్తింపూ ఉండటం లేదని ఎంపీలుగా గెలిచిన వారు చెబుతున్నారు. దీంతో కొత్తవారు ఎంపీగా పోటీ చేసేందుకు సైతం ముందుకు రావడం లేదు. అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎలే పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నారు. తాము కనీసం ఒక్క అధికారికి కూడా పోస్టింగ్ వేయించలేకపోతున్నామని ఎంపీలు బాధపడుతున్నారు. ఏలూరు ఎంపీ శ్రీధర్‌కు, చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాకు మధ్య గడిచిన నాలుగున్నరేళ్లుగా ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి ఉన్నప్పటికీ బయటపడని పరిస్థితి ఉంది. దీంతో ఇక ఎంపీగా పోటీ చేయకూడదని శ్రీధర్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఎంఎల్‌ఎలుగా ఉన్నవారినే ఒకరిని ఎంపీగా పోటీ చేయించాలని వైసిపి చూస్తున్నప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. నరసాపురం పార్లమెంట్ స్థానంలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో వైసిపి అధిష్టానానికి ఎంపీ అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. బడా వ్యాపారులను వెదికి పట్టుకుని రంగంలోకి దించుతారనే ప్రచారం సాగుతోంది. ఇక మరో ప్రధాన పార్టీ టిడిపి విషయంలోనే ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆ పార్టీకి సైతం ఎంపీ అభ్యర్థులపై ఇప్పటికీ స్పష్టత లేకుండాపోయింది. ఎంఎల్‌ఎ అభ్యర్థులకు సంబంధించి కొంతమేర స్పష్టత ఉన్నప్పటికీ ఎంపీ అభ్యర్థులకు సంబంధించి మాత్రం ఉలుకుపలుకు లేకుండాపోయింది. 2019లోనూ నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ఎవరూ దొరకకపోవడంతో చివరి నిముషంలో ఉండి ఎంఎల్‌ఎగా ఉన్న వేటుకూరి శివరరామరాజును ఎంపీగా రంగంలోకి దించారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. ఈసారి ఆయన ఎంపీగా పోటీ చేసే అవకాశం లేదని స్పష్టమైంది. పొత్తులో భాగంగా నరసాపురం ఎంపీ స్థానం జనసేనకు ఇస్తారనే ప్రచారం సైతం ఉంది. అదే జరిగితే గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీచేసి ఓడిపోయిన నాగబాబును మళ్లీ బరిలోకి దించుతారా అని అంచనాలు వేస్తున్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక ఎంపీ నిధులు తగ్గిపోవడంతోపాటు నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఎలు ఎంపీలను పట్టించుకోకపోవడం వంటి అనేక కారణాలతో పార్లమెంట్ స్థానాలకు పోటీచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో ఎంపీ అభ్యర్థులు కావలెను అనే తరహాలో ప్రధాన పార్టీలు తమ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాలకు ఇరుపార్టీల నుంచి ఎంపీ అభ్యర్థులుగా ఎవరు నిలబడతారో వేచిచూడాలి.





బావి



గాయపడిన రాకేష్





మృతిచెందిన యువకులు

ఆనందం.. ఆవిరి..!

న్యూఇయర్ వేడుకల నుంచి ఇళ్లకు వెళ్తుండగా అనూహ్య ప్రమాదం

ఇద్దరు యువకులను బలిగొన్న నేలబావి

కన్నీరుమున్నీరైన బంధువులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలకాలని ఐదుగురు స్నేహితులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అదీ జనారణ్యానికి దూరంగా మామిడితోటలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అత్యంత ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. అదే ఉత్సాహంతో ఉదయమే ఇళ్లకు బయల్దేరిన ఆ యువకులు గమ్యం చేరకుండానే అనూహ్యరీతిలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరొకరు గాయాలతో విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నగరంలోని మొఘల్రాజపురానికి చెందిన తలశీల కృష్ణచైతన్య (24), నున్న గ్రామానికి చెందిన శెట్టి సాయికుమార్ (24), నున్న రాకేష్(25), మరో ఇద్దరు స్నేహితులు కలిసి నూతన సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు ఆగిరిపల్లి మండలంలోని కనసానపల్లి గ్రామంలో గల నున్న రాకేష్ కుటుంబీకులకు చెందిన మామిడితోటకు ఆదివారం చేరుకున్నారు. రాత్రి సమయంలో వేడుకలు జరుపుకున్న ఐదుగురు యువకులు సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో తమ స్వగ్రామాలకు బయల్దేరారు. వీరిలో కృష్ణ చైతన్య, సాయికుమార్, రాకేష్ బుల్లెట్ మోటారు సైకిల్‌పై, మరో ఇద్దరు వేరే మోటారు సైకిల్‌పై బయల్దేరారు. వీరు ప్రయాణం ప్రారంభించి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లగానే కనసానపల్లి గ్రామ శివారుకు రాగానే వీరి వాహనానికి గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ భూమిలో ఎటువంటి రక్షణా లేని నేలబావిలోకి దూసుకుపోయింది. బుల్లెట్‌తోపాటు ముగ్గురూ నేలబావిలో పడిపోయారు. బాగా వెనుక కూర్చున్న రాకేష్ బావిలో ఉన్న నీటిలో పడిపోకుండా ముళ్లకంపను పట్టుకోగా బుల్లెట్ సహా కృష్ణచైతన్య, సాయికుమార్ నీట మునిగిపోయారు. దీంతో స్థానికులు, గ్రామపెద్ద ఎ.సంజీవరావు హుటాహుటీన అక్కడకు చేరుకుని అతికష్టంపై రాకేష్‌ను రక్షించి ఆస్పత్రికి తరలించారు. బావి నిండా ముళ్లకంపలు, బురద ఉండటంతో నీట మునిగిన వారిని బయటకు తీయడం కష్టసాధ్యమైంది. దీంతో సంజీవరావు, ఎఎస్‌ఐ, పోలీసులు ఆ బావిలో నీటిని తోడించి ఎట్టకేలకు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కృష్ణచైతన్య, సాయికుమార్ మృతదేహాలను బావిలోంచి బయటకు తీశారు. వీరు వాహనంతోసహా బావిలో పడిపోయే సమయంలో బావి అంచులకు, మెట్లకు తలలు తగలడం వల్ల తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆగిరిపల్లి ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.

ఒక్కగానొక్క కొడుకు ఇంటికొస్తాడని ఎదురుచూస్తుంటే..

కన్నీరుమున్నీరైన కృష్ణచైతన్య, సాయికుమార్ కుటుంబాలు

కృష్ణచైతన్య, సాయికుమార్ వారి తల్లిదండ్రులకు ఏకైక కుమారులు. నూతన సంవత్సరం వేడుకలు ఎవరికీ ఇబ్బంది కలగకుండా తోటలో జరుపుకుని ఉదయమే వచ్చేస్తామంటే సర్లే అనుకున్నాం. కానీ ఇలా విగతజీవులై పడి ఉంటారని ఊహించలేదు. చేతికొచ్చిన కొడుకు ఇలాగైతే ఎలా బతికేది అంటూ రెండు కుటుంబాల రోదనలు అందరినీ కలిచివేసింది.



కలెక్టర్‌కు జ్ఞాపికను అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

అన్నిరంగాల్లోనూ పురోగతి సాధించాలి

నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూతన సంవత్సరంలో జిల్లా అన్నిరంగాల్లోనూ మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేశారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఎఫ్ఒ రవీంధర్‌దామ, తదితరులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మెమెంటో, పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్స్ రాజేంద్రన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎ.అద్దయ్య, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, కలెక్టరేట్ సిబ్బంది, ఉన్నాతాధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు సిహెచ్.రంగారావు ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన పురోహితులు కిలాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు ఎనమంద్ర రవిప్రకాష్‌శర్మ అవదాని, కలెక్టర్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కొత్త ఆశలు, కొత్త ఆశయాలు, కొత్త అవకాశాలతో సరికొత్త ఆనందాలతో అందరి జీవితాల్లో వెలుగులు విరజిల్లాలని ఆకాంక్షించారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆమె జ్ఞాపికను అందజేశారు. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఏలూరు: రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉప రవాణా కమిషనర్ శాంతికుమారికి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో సోమవారం శాంతకుమారి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలక్టర్‌చే రెవెన్యూ డైరీ ఆవిష్కరణ

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ డైరీని ఆవిష్కరించారు. అలాగే జెసి బి.లావణ్య వేణి ద్వారా రెవెన్యూ కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏలూరు ఆర్‌డిఒ ఖజావలిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఎనిమిదో తేదీ వరకూ దశలవారీగా ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెరిగిన నేపథ్యంలో ఈనెల రెండో తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం మండల, మున్సిపల్ పరిధిలో పెన్షన్ పంపిణీ చేస్తామని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు తెలిపారు. రెండో తేదీన బుట్టాయగూడెం, కలిదిండి మండలాల్లో పింఛను పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. మూడో తేదీన చింతలపూడి రూరల్, అర్బన్, పెదవేగి, ఏలూరు రూరల్, అర్బన్, పోలవరం, నూజివీడు, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోనూ, నాలుగో తేదీన జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్, పెదపాడు, నూజివీడుఅర్బన్, భీమడోలు, టి.నరసాపురం, ఉంగుటూరు మండలాల్లో ప్రారంభమవుతుందన్నారు. ఐదో తేదీన కామవరపుకోట, లింగపాలెం, దెందులూరు, ద్వారకాతిరుమల, చాట్రాయి, కొయ్యలగూడెం, గణపవరం, నిడమర్రు మండలాల్లో, ఆరో తేదీన ముసునూరు, జీలుగుమిల్లి మండలాల్లో పింఛను పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. ఏడో తేదీన ఆగిరిపల్లి, ఎనిమిదో తేదీన కుక్కునూరు, వేలేరుపాడు ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలో 2,33,726 మందికి వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకార్మికులు, ఒంటరి మహిళలకు జనవరి నుంచి రూ.2,750 నుంచి రూ.మూడు వేలకు ప్రభుత్వం పెంపుదల చేసిందన్నారు. జిల్లాలో 2,33,726 మంది పెన్షన్లకు గాను పెంచిన మొత్తం కింద ప్రతినెలా అదనంగా రూ.5.84 కోట్లు పంపిణీ చేస్తున్నారన్నారు. వీటితోపాటు జిల్లాలో మిగిలిన ఇతర రకాల పెన్షన్లతో కలిసి మొత్తం 2,87,845 మందికి రూ.85.94 కోట్లు ఈ నెల రెండో తేదీ నుంచి పంపిణీ చేస్తామని తెలిపారు. జనవరి నుంచి కొత్తగా మంజూరైన 9,326 పెన్షన్లు ఉన్నాయన్నారు. ఇతర పెన్షన్ల కింద 44,793 మంది లబ్ధిపొందుతున్నారని తెలిపారు.

రోడ్లపైనే కొత్తసంవత్సర వేడుకలు

21వ రోజు అంగన్వాడీల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్వాడీల సమ్మె సోమవారానికి 21వరోజుకు చేరింది. ఈ సందర్భంగా పలుచోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను సైతం అంగన్వాడీలు రోడ్లపైనే జరుపుకున్నారు. కేకులు కట్‌చేశారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలంతా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.

భీమడోలు: మండలంలో అంగన్వాడీల నిరవధిక సమ్మె 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆటపాటలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చల్లామ, రాజమణి నాయకత్వం వహించారు.

కొయ్యలగూడెం : మండలంలోని అంగన్వాడీలు ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, మాధవి, భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక సచివాలయం ముందు అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి, దుర్గ, కలపాల విద్యావతి, మేరీ సులోచన, శిరీష, లక్ష్మీ, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ , అలివేలు పాల్గొన్నారు.



ఏలూరులో అంగన్వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న మాజీ ఎంపీ, టిడిపి నేత మాగంటి బాబు

జీలుగుమిల్లి : మండలంలోని అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరం వద్ద నృత్యాలతో, నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, సిపిఎం నాయకుల అప్పారావు, అంగన్వాడీలు నాగమణి, ఎస్తేరు, సరళ, పూర్ణ, జ్యోతి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె 21 రోజూ కొనసాగింది. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నున్న రమాదేవి, ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినేడి రమాదేవి, అంగనవాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని అంగన్వాడీల సమ్మె 21వ రోజూ కొనసాగింది. సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి సంఘీభావం తెలిపారు.

చాట్రాయి : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ మండలంలోని అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పిడికిలి బిగించి నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమీలారాణి, ఏసమ్మ, మణి పాల్గొన్నారు.

మండవల్లి : పండుగలను వీధుల్లోనే చేసుకునే చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కిందని అంగన్వాడీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమ్మె 21వ రోజూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు వాణి, చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి, మల్లేశ్వరి, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

చింతలపూడి : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, అంగన్వాడీ, మున్సిపల్ సమ్మె శిబిరాలను సందర్శించి మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సమ్మె విరమించుకుంటే కార్మికులను మార్చాల్సి వస్తుందని పత్రికా ప్రకటన చేశారని, కార్మికులను తమరు మార్చడం కాదని కార్మికవర్గం తలచుకుంటే మిమ్మలను మార్చే సత్తా ఉందని గ్రహించి మాట్లాడాలన్నారు. అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 31న జరిపిన ఆట పాట పోటీలలో చింతలపూడి మండలంలో గెలిచిన అంగన్వాడీలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈరోజు కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి టి.మాణిక్యం, జి.సరళ, హేమలత, పద్మ, అరుణ, చెన్నకేసరి, మున్సిపల్ కార్మికులు జి.నాగరాజు, సత్యం, వంశీ, వల్లి పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

టి.నరసాపురం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి వారి సమ్మెను విరమింపజేయాలని యుటిఎఫ్ మండల నాయకులు జి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

నిడమర్రు : అంగన్వాడీల పట్ల ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు విమర్శించారు. స్థానిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో రబియ, ధనలక్ష్మి, కెవి.సత్యవతి, రామలక్ష్మికుమారి, పార్వతి, జయమ్మ మాట్లాడారు.

ఆగిరిపల్లి : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గత 22 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కనబోయిన వేణు, దొండపాటి ఏసుపాదం, నలజాల హరిబాబు పాల్గొన్నారు.

ముదినేపల్లి : అంగన్వాడీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వ్యవహరించడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్న మాధవ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ, రిబ్కా, మణి, పద్మ పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటం.. దిగొచ్చిన ప్రభుత్వం

మూడు విభాగాల మున్సిపల్ కార్మికుల జీతాల పెంపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాట ఫలితంగా మున్సిపాలిటీలోని మూడు విభాగాల కార్మికులకు హెల్త్ అలవెన్స్ రూ.ఆరువేలు చొప్పున జీతాలు పెంపుదలకు జిఒ1 విడుదలైంది. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గతనెల 26వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. 28వ తేదీన ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర నాయకత్వానికి, మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, డిఎంఎ కోటేశ్వరరావు సమక్షంలో కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించింది. దానిలో భాగంగా మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగం ట్రాక్టర్ డ్రైవర్లు, మలేరియా విభాగం వర్కర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్లు ఈ మూడు కేటగిరీల వారికి ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ (ఒహెచ్ఎ) అమలుకు ప్రభుత్వ అంగీకరించింది. ఆ మేరకు జిఒ1ని ప్రభుత్వం విడుదల చేసింది. మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాట ఫలితంగా కొంతమంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం స్పందించింది. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించి సమ్మె విరమణకు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మిగిలిన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి


సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె పట్ల సిఎం జగన్ ప్రభుత్వం మొండివైఖరి వీడాలని కోరుతూ నగరంలో సిఐటియు ఆధ్వర్యాన సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. పాతబస్టాండ్ సెంటర్ నుండి ప్రారంభమైన ప్రదర్శన క్రరల వంతెన సెంటర్, పవర్ పేట రైల్వే స్టేషన్, ఆర్ఆర్ పేట, ప్రభుత్వాసుపత్రి, ఫైర్‌స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంది. సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన మహిళలను, ఉద్యోగులను రోడ్లు మీదకు తెచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు 21 రోజులుగా, సమగ్ర శిక్ష ఉద్యోగులు 13 రోజులుగా, మున్సిపల్ కార్మికులు ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా వైసిపి ప్రభుత్వం దున్నపోతుమీద వర్షం పడినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జగన్ హామీలనే అమలు చేయాలని కోరుతుంటే కనీసం సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని విమర్శించారు. మాట తప్పను-మడమ తిప్పనని చెప్పిన ముఖ్యమంత్రి నేడు హామీలన్నీ విస్మరిస్తున్నారన్నారు. అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు సిఐటియు పూర్తిఅండగా నిలబడుతుందని తెలిపారు. సమగ్ర శిక్ష నాయకులు పౌల్‌రాజు, రంగారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు బి.సోమయ్య, జాన్‌బాబు, అంగన్వాడీల యూనియన్ నాయకులు కె..విజయలక్ష్మి, బి.భవాని మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఉద్యోగులంతా కలిసికట్టుగా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు స్వప్న, హైమావతి, బేబీరాణి, తిరుపతమ్మ, కృష్ణవేణి, రంగమ్మ, అరుణ, నవతి, విజయలక్ష్మి, జయసుధ, బి.జగన్నాథం, జై.గోపి పాల్గొన్నారు.




ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి

బొర్రంపాలెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో భగవాన్ శ్రీసత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో పరసా శ్రీను స్వాతి దంపతుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన దుప్పట్లను ఎంపిటిసి కలపర్తి సుజాత రామకృష్ణలు సోమవారం 40 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలన్నారు. సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో చావ వీర రాఘవులు, రామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


బాధితురాలికి సాయం చేస్తున్న డాక్టర్ మనోజ్

అగ్ని బాధితురాలికి టిడిపి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు శివారు అప్పారావుపేట గ్రామానికి చెందిన పరసా సరోజినీ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఆదివారం రాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని గృహోపకారణమున్ని అగ్నికి ఆహుతి అయ్యాయి. సరోజిని కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకులు కొడాలి వినోద్ సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి అప్పారావుపేట వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేసి భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రెసిడెంట్ జొన్నలగడ్డ వీరాస్వామి, ముదినేపల్లి ఉపసర్పంచి ఈడే సుధాకర్, అనగాని వెంకట్రావు, అనగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమైన సరోజినిని ప్రముఖ వైద్యులు డాక్టర్ మనోజ్, వైష్ణవి పరామర్శించారు. సోమవారం అప్పారావుపేట వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, ప్రమాదంకు గల కారణాలను బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5 వేలు నగదు, నెలకి సరిపడా నిత్యవసర సరుకులు మనోజ్, వైష్ణవి సీతారామమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యేరు గ్రామ విఆర్ఓ కారే కేశవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'దాహార్తిని తీర్చండి'

ప్రజాశక్తి - భీమడోలు

దాహార్తిని తీర్చండి అంటూ పొలసానిపల్లి బిసి కాలనీవాసులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై స్పందించిన సర్పంచి సమస్య పరిష్కారానికి బాధ్యత వహిస్తూ తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, తమకు శాశ్వత పరిష్కారం మార్గం చూపాలని వారు వేడుకుంటున్నారు. వివరాలలోనికి వెళ్తే దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం అప్పట్లో నూతనంగా ఏర్పడిన బిసి కాలనీకి తాగునీటి సరఫరా కోసం పైపులైనును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో కాలనీ అభివృద్ధి చెందటం, రోడ్ల ఎత్తు పెరగటం, ఇతర కారణాలవల్ల అప్పట్లో వేసిన పైపులైన్ క్రింది భాగానికి చేరుకుంది. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాలపై గ్రామ సర్పంచిని వివరణ కోరగా సమస్య పరిష్కారానికి బిసి కాలనీలో పైపులైను నూతనంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతస్థాయి బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లగా వారి ఆదేశాల మేరకు గ్రామీణ నీటి సరఫరా శాఖకు ప్రతిపాదన సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఈ విషయమై ప్రగతి తక్కువగా ఉంటంతో సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యక్తిగతంగా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనుమతితో పాటు నిధులు మంజూరుకాగానే నూతన పైపులైన్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటామని సర్పంచి తెలిపారు.


ట్యాంకర్ ద్వారా నీటిని నింపుకుంటున్న గ్రామస్తులు

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

దెందులూరు మండలం గుండుగొలను హైస్కూల్ వద్దగల జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు చనిపోగా, మరొక ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుండుగొలను గ్రామానికి చెందిన గంటా బాబు, నత్తా వంశీ, కొవ్వలి సురేష్ ఒకే మోటర్ సైకిల్‌పై వస్తుండగా హైస్కూల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నారు. వాహనం అదుపు తప్పడంతో రోడ్డుపై పడ్డారు. వీరిలో గంటాబాబు ఘటనా స్థలిలోనే చనిపోగా తీవ్రంగా గాయపడిన నత్తా వంశీ ఏలూరులోని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలియ వచ్చింది. మరొక యువకుడు కొవ్వలి సురేష్ ఏలూరు ప్రభుత్వ వైద్యాశాలలో చికిత్స పొందుతున్నారు.


గంటాబాబు(ఫైల్)

మహిళపై ఇనప రాడ్డుతో దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని దేవరగుంట గ్రామానికి చెందిన వేముల ఏడుకొండలు(45) అదే గ్రామానికి చెందిన సమీప బంధువు రంగారావు(52) సరిహద్దు తగాదాల్లో సోమవారం ఇనుప రాడ్డుతో దాడి చేసినట్టు బాధితురాలు ఏడుకొండలు తెలిపింది. తలకు బలమైన గాయం కావడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తమకు రక్షణ కల్పించాలని తనకు ప్రాణ హాని ఉందని ఆమె తెలిపారు. వివరాలు తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట శిబిరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మండలంలోని పి.రాజవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.630 నగదును స్వాధీనం చేసుకొని వారందరిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'నీటి మూటలుగా అధికారుల మాటలు'

రహదారిపైకి మురుగునీరు
పట్టించుకోని అధికారులు
ప్రమాదాల బారిన వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి - మండవల్లి

రహదారి పనుల వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం.. ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉంటాం అని అధికారులు చెప్పిన మాటలు నీటి మూటలు అయ్యాయి. ప్రమాదాలు జరగకుండా పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టడంలో అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తూ రహదారిపై ఏర్పడ్డ పెద్దపెద్ద గోతుల్లోకి చేరుతుంది. దీంతో మురుగునీటిలో గొయ్యి ఎంత ఉందో తెలియక రహదారిపై ప్రయాణం ప్రమాదంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూనే కాంట్రాక్టర్ ఇచ్చే కాసులకు వెంపర్లాడుతూ చూసి చూడనట్లు అధికారులు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి దాపరించిందని ప్రజలు, వాహనదారులు స్పష్టం చేస్తున్నారు.


గోతులమయంతో రహదారి

వాహనదారులు, ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారి పామర్రు-దిగమర్రు 165పై నిర్వహిస్తున్న పనులను కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఇస్తానుసారంగా తవ్వకాలు చేసేస్తున్నాడు. అంతేకాకుండా సుమారు రెండు సంవత్సరాల క్రితం మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తి చేయకపోగా ముక్కల ముక్కలుగా నిర్మించి వదిలేశాడు. అంతేకాకుండా అధికారుల అండదండలు కాంట్రాక్టర్‌కు మెండుగా ఉండడంతో నిర్లక్ష్యంగా తవ్వకాలు చేయడమే కాక ఆ ప్రాంతంలో ప్రమాదాలు సంభవించకుండా, కనీస సూచక బోర్డులను కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో నిర్లక్ష్యంగా తవ్వి వదిలేసిన గుంతలో పడి మండవల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్‌కు నడుం విరిగిపోయింది. ఈ సంఘటనపై ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎన్‌హెచ్‌డిఇ సత్యనారాయణ రహదారిపై జరుగుతున్న పనులను, మండవల్లిలో నిలిచిపోయిన డ్రెయినేజీ నిర్మాణం పనులను డిసెంబర్ 16 శనివారం పరిశీలించారు. రహదారిపై నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న పనులపై, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రెయినేజీని, ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అందుబాటులో ఉండి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి త్వరితగతిన డ్రెయినేజీ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటానని చెప్పి, రహదారిపై మురుగునీరు ప్రవహిస్తున్న గోతులు పడి ప్రయాణం ప్రమాదకరంగా మారితే అందుబాటులో లేకుండా ఎక్కడికి వెళ్లారు అంటూ వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో అధికారుల మాటలు చెప్పేందుకేనని ప్రమాదాలను నియంత్రించడంలో శూన్యమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ మితిమీరి చేస్తున్న పనుల వల్ల ప్రమాదాలు జరిగి వాహనదారులు, ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులు నెలకొన్న ఇబ్బందులను తొలగించి, ప్రమాదాలు నివారించాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌ఎఇ శరత్‌ను వివరణ కోరగా రహదారి విస్తరణ పనులను నిర్వహించడంలో కాంట్రాక్టర్ కొంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. అయితే ఇప్పటికే ఉన్నతాధికారులు పనులపై పలుమార్లు హెచ్చరించడం కూడా జరిగిందని, మరోసారి ఇలా జరిగితే నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


రైతుసంఘం, యుటిఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 2024 సంవత్సరంలో పంటలు బాగా పండి రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రైతు సంఘం చేస్తున్న కార్యక్రమాల్లో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి, జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీప్రసాదరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నాయకులు గండి రాజా, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



చింతలపూడి : యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ



ఏలూరు అర్బన్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎడి

చింతలపూడి : ఉపాధ్యాయులు పాఠశాలలో సమస్యలు లేకుండా చూసుకుని మంచి విద్యాబోధన చేయాలని ఎంపిపి రాంబాబు తెలిపారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, ఎంఇఒ రామరావు, కిరణ్‌బాబులతో కలసి యుటిఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడి పరిష్కరించటంలో యుటిఎఫ్ ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటియఫ్ మండల అధ్యక్షులు దామోదర్, యుటిఎఫ్ మండల నాయకులు ప్రేమ్‌కుమార్, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీసుగుణ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో వివిధ పుష్పాలు, రంగులతో 2024కు స్వాగతం పలుకుతూ తీర్చిదిద్దారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కారి రాజమణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


పోలవరం : సూర్యతేజకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫీడర్ అంబులెన్సు సిబ్బంది

టి.నరసాపురం : మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన వేడుకల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, పుట్రేపు, ప్రకాష్‌నగర్, టి.నరసాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల్లో తోటి వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జి.జ్ఞాన్ రాజు, కె.నిరీక్షనరావు, సిహెచ్.హెూషేయ, రమేష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని ద్వారక ఎస్టేట్స్ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు నిర్వహించారు. కేకులు కట్ చేసి, స్వీట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల అభిమానాలు ఎప్పటికీ మరువలేనన్నారు. సిఎం జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరలా ఆయన్ని సిఎం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సిబ్బందికి స్వీట్లు పంచిన సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

పోలవరం : ఐటిడిఎ కెఆర్ పురం ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది, జిల్లా మేనేజర్ శ్రీనివాస్ నాయక్ ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూర్యతేజని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సూర్య తేజ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మరెన్నో ఫీడర్ అంబులెన్స్ సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు.

టిడిపి మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్, సభ్యులందరూ కలిసి రాజానగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లి మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, ప్రజలకు ఆయన సుమారు 3 వేల మందికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ సొబ్బన్న రాజశేఖర్ బాబు, వైస్ ప్రెసిడెంట్ వెంకన్న, దొడ్డి సుధాకర్ రాజు, సిద్దే రామారావు, కుంజం రాంబాబు, అయినపర్తి బుజ్జి, జల్లేపల్లి చిరంజీవి, పీతల అర్జున్ రావు, సహన్నా భాష, తన స్వగృహంలో వేలాదిమంది నాయకులు పాల్గొని ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.




మండవల్లిలో..

పోలవరం మండలంలో నూతనగూడెం గ్రామంలో 108 సంవత్సరముల బామ్మకు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పోలవరం ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ సొబ్బన రాజశేఖర్ బాబు, క్లబ్ సభ్యులు, జల్లేపల్లి అచ్చాయమ్మకు నూతన సంవత్సర సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ కేకు కటింగ్ చేసి బామ్మ ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం సొబ్బన రాజశేఖర్ బాబు మాట్లాడుతూ శతాధిక వృద్ధాప్యంలో ఉన్న బామ్మకు పదిమంది సంతానం, కుమారుడు కుమారులను మనవడులను ఐదు తరాలను చూసిన ఈ బామ్మ ఎంతో ఆరోగ్యంగా ఉందని ఇంకా ఎంతో సంతోషంగా కుటుంబంతో కలిసి ఉండాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సిద్దే రామారావు, కుంజం రాంబాబు, అయినపర్తి బుజ్జి, బుచ్చన్న దొర, దొడ్డి సుధాకర్ రాజు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండల ప్రజలు ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు సోమవారం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, యువకులు ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముదినేపల్లి గ్రామంలో ఎల్ఇఎఫ్, క్రీస్తు సంఘం, ఆర్‌సిఎం, సిబిసిఎన్‌సి, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థన మందిరాల్లో బల్లారాధన, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. చర్చిలు ప్రజలతో కిటకిటలాడాయి.

మండవల్లి : ఆపద సంభవించిన అణగారిన వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపేలా సకాలంలో బీమాలను అందించి ఆదుకోవడంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావుకు సాటి ఎవ్వరూ రారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. 2024 నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని స్థానిక ఇండియన్ బ్యాంకులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను అవినీతికి తావు లేకుండా నిర్వహిస్తూనే పేద ప్రజల అభివృద్ధి పట్ల సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి దుర్గారావు అని అన్నారు. దుర్గారావు మరిన్ని మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు.


నూజివీడు రూరల్ : వేడుకల్లో ఎంఎల్ఎ అప్పారావు

ఆగిరిపల్లి : నూతనసంవత్సరం సందర్భంగా నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆగిరిపల్లిలోని శ్రీశోభనాచల వార్ష్య లక్ష్మీ నరశింహ స్వామి వారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం వెంకట శేషుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎంఎల్ఎ ప్రతాప్ నియోజకవర్గ ప్రజలకు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పి.నరశింహారావు, టౌన్ పార్టీ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పి.వీరబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.హరిబాబు, సర్పంచులు ఆర్.సురేష్‌కుమార్, ఎ.మురళీ మోహనరావు, సచివాలయాల కన్వీనర్ ఎన్.భాస్కర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గం జనసేన కార్యాలయం వద్ద సోమవారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల జనసేన నాయకులు, జనసైనికులు, వీరామహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మరాజుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మరాజు ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా సంయుక్త కార్యదర్శి గంగుమోలు చిన్న రత్తయ్య పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

ముసునూరు : గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, శాంతి, స్నేహ భావాలతో ఆనందంగా పండగలు జరుపుకోవాలని మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామ పరిధిలోని పలు చర్చిలకు నూతన సంవత్సర కేకులు పాస్టర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో ఈనెల 2వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి తెలిపారు. ఆగడాల లంకలో రెండవ తేదీన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. దీనిని మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య ప్రారంభిస్తారన్నారు. క్యాంపులను వారంలో ఒకరోజు వంతున మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తామన్నారు. ఈ మధ్యకాలంలో బాధ్యులు నిర్ణీత కార్యక్రమాలైన ఇంటింటా సర్వేలు, రోగుల గుర్తింపు కార్యక్రమాలను పూర్తి చేస్తారని తెలిపారు. ఈ క్యాంపులో పిల్లలు, తల్లులతో పాటు దీర్ఘకాలిక రోగులకు, ఇతరులకు వైద్య సేవలు అందుతాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తింప చేయడానికి సహకరిస్తారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్లు క్యాంపుల నిర్వహణకు అవసరమైన మందులు, ఇతరాలను సిద్ధం చేస్తారని చెప్పారు.


బోట్లు, పరికరాలు అందిస్తున్న మల్లిబాబు

మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటాం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటామని బొర్రంపాలెం మాజీ సర్పంచి పెండ్యాల మల్లిబాబు తనయుడు అభిషేక్ బాబు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఇటీవల మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన మత్స్యకారులకు బోట్లు, పరికరాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 మంది మత్స్యకారులకు రూ.50 వేల విలువ చేసే పరికరాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రె జక్రయ్య, బత్తుల రమేష్, రాజమోని రమేష్ పాల్గొన్నారు.


కృష్ణతేజను అభినందిస్తున్న ప్రిన్సిపల్

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు కృష్ణతేజ ఎంపిక


ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి అయితం మోహనసాయి కృష్ణతేజ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో రాజమండ్రికి చెందిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం జట్టు సభ్యునిగా పాల్గొననున్నాడని ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. ఇటీవల కాలంలో నరసాపురంలో జరిగిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం స్థాయి క్రికెట్ పోటీల్లో ఏలూరు జిల్లా సభ్యునిగా కృష్ణతేజ పాల్గొన్నారు. ఆయన చూపిన ప్రతిభ ఆధారంగా విశ్వవిద్యాలయం జట్టు సభ్యునిగా ఎంపికయ్యారు. ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చెన్నైలోని హిందుస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కాలేజీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడని ప్రిన్సిపల్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కృష్ణతేజను ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్‌తో పాటు ఇతర లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు.

భవాని మాలధారుల సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - పోలవరం

భవాని మాలదారులు మొక్కు తీర్చుకోవడానికి విజయవాడలోని కనకదుర్గమ్మ గుడికి సైకిల్‌పై సోమవారం పోలవరం నుంచి ద్రాక్షారపు సత్యనారాయణ, గోవిందు, ఎం.పోశి బాబులు స్థానిక దుర్గమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి యాత్రను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా భవాని మాలదారు ద్రాక్షారపు సత్యనారాయణ మాట్లాడుతూ కనకదుర్గ మాల దారులమైన మేము 41 రోజులు పాటు ఎంతో నిష్ఠతో దీక్ష చేశామని చెప్పారు. సైకిల్ పై విజయవాడలోని కనకదుర్గమ్మ గుడిని దర్శించుకుని మొక్కు తీర్చుకుంటామని మొక్కుకున్నామని, ఆ ప్రకారం సైకిల్ తొక్కుకుంటూ వెళ్తున్నట్లు వివరించారు. విజయవాడ గుడికి చేరుటకు మూడు రోజులు పడుతుందన్నారు. ఎంతో భక్తితో చేపడుతున్న సైకిల్ ప్రయాణం మాకు ఎంతో తృప్తినిస్తుందని తెలిపారు. ఈ యాత్ర వల్ల ఆధ్యాత్మికత చింతన, ఆ దుర్గమ్మ తల్లిపై భక్తి పెరుగుతుందని తెలియజేశారు.


చిన్నారులతో సిఐ మల్లేశ్వరావు

కష్టపడి చదవాలి : సిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లవచ్చని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో చింతలపూడి లిబర్టీ చిల్డ్రన్ హోమ్ నందు నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సరదాగా వారితో గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆనందంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.